# కొత్త మలుపు

—షాహీన్

"అత్తయ్యా! మీకెన్నిసార్లు చెప్పాను? టి.వి. ముట్టుకోవద్దని? అది ఒక వేయి రెండు వేల సొమ్ము కాదు పద్నాలుగు వేలు పెట్టి కొన్న టీవి! ఏమాత్రంపాడైనా కొట్టులో పాలేయడానికి తప్ప మరిదేనికీ పనికిరాదు!" కోపంగా అంది అప్పుడే వచ్చిన శాంతి.

"బాబూ ఊరికే వేయమని మారాం చేస్తూంటే..." మెల్లగా అంది ఈశ్వరమ్మ.

"ఆహా! ఈరోజు టి.వి వేయమని మారాంచేస్తే టి.వి వేసేసారు? రేపొద్దున్న ఆ టీ.వినే పగలగొట్టమని పేచీ పెడితే పగలకొట్టేస్తారా?"

"అదికాదు తల్లీ! బాబు టి.విలో ఏదో మంచి ప్రోగ్రాం వస్తోందని చెప్పాడు! మీ అమ్మ వచ్చి వేస్తుందిలే అన్నా? వేయకపోతే అన్నం తినని బయటకు వెళ్ళిపోతానని ఊరికే ఏడిస్తే ...."

"ఏం? నేనొచ్చేవరకూ ఆగలేరా? మీ మొగుడితో సినిమాకెళ్ళే అదృష్టం ఎలాగూ లేదు! పక్కవాళ్ళతోనైనా ఒక్కరోజూ సినిమా కెళితే ఇల్లు పీకి పందిరేస్తారు!" విసుక్కుంది శాంతి.

"ఇప్పుడు టి.వి ఏమీ పాడవ్వలేదుగా తల్లీ!" నెమ్మదిగా అంది ఈశ్వరమ్మ.

"అంత పాడై పోవాలనా మీ ఉద్దేశం? అంతేలెండి! ఎంత బాగాచూసినా కోడలు కోడలే అని ఊరికే అన్నారా?"

"అదేంటమ్మా శాంతీ! ఇప్పుడేమైందని? బాబేడుస్తుంటే మీ అత్తయ్య టి.వి వేసింది! ఇంత చిన్న విషయానికి నీవిలా రాద్ధాంతం చేయడం ఏం బాలేదమ్మా!" అన్నాడు అన్నీ వింటున్న రామనాథం.

"అవునవునండి! అంతా నన్నేవాళ్ళు! ఇతరుల సొమ్ము ముట్టకూడదని ముందు మీ భార్యకు బుద్ధి చెప్పండి! ఛ! ఛ! ఆ సినిమాహాల్లోనే వుండి 'మొదటి ఆట' సినిమా చూసివచ్చినా బాగుండేది" అని గొణుక్కుంటూ పెరట్లో కెళ్ళిపోయింది.

శాంతి.

"ఏంటి? ఏం జరిగింది?" అన్నాడు అప్పుడే వచ్చిన హరీష్.

హరీష్ గొంతు విని గబగబా పెరట్లో నుంచి వచ్చింది శాంతి.

"ఏం జరిగిందని మెల్లగా అంటా లేవిటండీ?" అంటూ జరిగిన విషయంలో తన తప్పేమిలేనట్టుగా చెప్పింది.

"ఏంటమ్మా! వయసు పెరుగుతుంటే బుద్ధి మందగిస్తుంది మీకు? అయినా అది ముట్టుకోవద్దని లక్షసార్లు చెప్పాను. ఛ! ఛ! రోజూ యింటికి వచ్చేరావడంతోనే ఏదో ఒక గొడవ!" అని చెప్పులేసుకుని మళ్ళీ బయటకు వెళ్ళిపోయాడు.

శాంతి ముక్కు చీదుతూ పెరట్లోకి వారితీసింది.

ఈశ్వరమ్మ ఏడుస్తూ గోడపక్కన కూలబడిపోయింది

"ఊరుకో ఈశ్వరీ! అంతా స్వయం కృతాపరాధం! అనుభవించాల్సిందే మరి!!" అన్నాడు రామనాథం

* * *

ఆ మరునటిరోజు బాబు ఊరికే గుక్కపట్టి ఏడుస్తున్నాడు. శాంతి వంటింట్లో నుంచి గబగబా వచ్చింది.

"బాబిలా ఏడుస్తుంటే చూస్తూ కూర్చునే బదులు కాస్త సముదాయించ వచ్చుగా అత్తయ్యా!" అని గదిమింది.

"అదికాదు శాంతి..." అంటూ ఏదో చెప్పబోయేంతలో...

"ఊ! ఎవరికి తప్పినా నాకు తప్పు తుందా?" అని కొడుకుని బుజ్జగిస్తూ "ఏరా? ఎందుకలా ఏడుస్తున్నావ్?" అంది.

బాబు ఏడుస్తూనే టీవి వంక చెయ్యి పెట్టి చూపాడు.

"టీ.వి వేయాలా?" అని టీ.వి ఆన్ చేసి "అత్తయ్యా! బాబు టీ.వి వేయమని ఇందాకట్నుండీ ఏడుస్తుంటే మీరలా చూస్తూ కూర్చున్నారేగాని టీ.వి ఆన్ చేయలేదు! దానికోసం నేను వంటమానేసి లోనుండి రావాలి!" అంది గట్టిగా.

"అదికాదు శాంతి..."

"ఏది కాదు! ప్రతిపనీ చేయలేక చస్తున్నాను! ఈ చాకిరీ నాకెప్పుడు తప్పు తుందోగాని...ఛ!ఛ!ఛ!" విసుక్కుంటూ లోనికెళ్ళిపోయింది.

ఈశ్వరమ్మ కోడలి మాటలు విని అచేతనంగా వుండిపోయింది. అంతలో రామనాథం వచ్చి "ఈశ్వరీ! ఆ డేదో చేసేస్తే పోయేదిగా! దానికోసం యీ దెబ్బలాటలెందుకు చెప్పు!" అన్నాడు.

కొద్దిగా తేరుకున్న యీశ్వరమ్మ "అదికాదండీ! నిన్న ఆ టీ.వి వేసాననేగా తగవుపెట్టింది. అందుకని..."

"అది నిన్నటి సంగతి ఈశ్వరీ! ఇది ఈరోజు సంగతి!" అన్నారు రామనాథం వచ్చే కన్నీటిని అపుకుంటూ.

భర్త కళ్ళల్లో నీళ్ళు చూసిన ఈశ్వరమ్మకు కన్నీరాగలేదు.

"ఏమండీ!" అతన్ని పట్టుకుని ఏడ్చింది.

"ఊరుకో ఈశ్వరీ! అంతా మన కర్మం. అంతే!" అన్నాడు పైపంచతో కన్నీళ్ళు తుడుచుకుంటూ.

* * *

ఆరోజు దసరాపండుగ. ఈశ్వరమ్మ కూతురు విశాలి, అల్లుడు, రెండోకొడుకు సురేష్. అతని భార్య విమల, పిల్లలు రావడంతో యిల్లంతా చాలా సందడిగా వుంది.

ఈశ్వరమ్మ కూడా తన బాధలు, కష్టాలు అన్నీ తాత్కాలికంగా మరిచిపోయి కోడళ్ళను, కూతురిని కబుర్లాడుకొమని చెప్పి తనే స్వయంగా వంట చేయడం ఆరంభించింది. కొద్దిసేపైన తర్వాత విశాల వంటింట్లో కొచ్చింది.

పులిహోర కలపడంలో నిమగ్నమై వున్న ఈశ్వరమ్మ విశాలనంతగా పట్టించుకోలేదు.

"అమ్మా!" మెల్లగా అంది.

"ఊఁ!"

"అమ్మా!" మళ్ళీ గట్టిగా అంది.

"ఏమిటి? ఏం కావాలి?"

"అదికాదే! మరి పండక్కి నాకేమి యి...వ్వ...లే...దు?" అంది నెమ్మదిగా కాలి బొటనవేలు నేలకు రాస్తూ.

"అదేంటే విశాలా? ఉదయమేగా నీకూ, అల్లుడుగారికి బట్టలు పెట్టి రెండొందలు యిచ్చాం!"

"బోడి పట్టుచీర, డబ్బులు ఎవరికి కావాలే?"

"మరి?" ప్రశ్నార్థకంగా అడిగింది.

"పుట్టింటి నుండి ఓ నగానట్రాకూడా తీసుకురావని మా తోడికోడళ్ళూరికే దెప్పుతారే అమ్మా! అందుకని..."

"నా దగ్గరున్న నగలు నీకూ వదినలకు పంచేసా గదమ్మా! నీ కింకా ఎక్కువే యిచ్చాను! ఇహ నా పేరునున్న యీ ఇల్లు కూడా మూడువాటాలేసి ముగ్గురికి పంచేసాము!"

"ఆ...నువ్వు నా కిచ్చేదేంటసే? ఇంట్లో ఒక్కవాటా అంతేగా! మా నానమ్మ నగలే నా కిచ్చావ్!" ఈసడింపుగా అంది విశాల.

"విశాలా! ఇంకా మీ అమ్మ దగ్గరేం వుందని నీ కివ్వడానికైనా?" అన్నాడు అక్కడే వుండి అన్నీ వింటున్న రామనాథం.

"అదేంటి నాన్నగారు? మీరూ అలానే అంటారు! అమ్మచేతిలో రెండు జతల గాజులున్నాయ్! వయసు పైబడుతుంటే యింకా అవెందుకు చెప్పండి?" అంది గట్టిగా విశాల.

హతాశులయ్యారు భార్యాభర్తలిద్దరూ.

ఈ గొడవకు కోడళ్ళిద్దరూ వచ్చారు గబగబా.

"అవెలాగిస్తారు విశాలా? అయినా ప్రతి పండక్కి వచ్చి కూర్చుంటే ఇస్తూనే వున్నారాయె! ఇంకా ఆమె ఒంటిమీదున్న నగలు కూడా ఇచ్చేయమనడం ఏమన్నా

కావుందా?" అంది కాంతి.

దానికి వంత పలికింది సురేష్ భార్య విమల.

ఆ మాటలతో కోడళ్ళ మీద ప్రేమ పొంగిపొరలింది ఈశ్వరమ్మకు.

వాళ్ళవైపు ప్రేమతో చూసింది.

"ఆ! మీరలాగే అంటారు! ఆ రెండు జతల గాజులూ వేరో జత పంచేసుకుందామని మీ ప్లాను!" అంది విశాల.

"పంచుకుంటే పంచుకుంటాం!" మధ్య నీ సొమ్మేం పోయిందనీ! అయినా యిన్నిరోజులుగా వాళ్ళను పోషించి వాళ్ళ ఆలనాపాలనా చూస్తున్నాం! అవి మేం తీసుకోక నీ కిచ్చేస్తా మనుకున్నావా?" అంది విమల.

అప్పటివరకు పొంగిన ప్రేమమీద ఒక్కసారిగా నీళ్ళు జల్లినట్లయింది! ఆమెకు కన్నీరుబికి వస్తున్నాయి! కోడళ్ళంటే బయటవారు! కానీ తన కూతురు ...తన కడుపుచించుకు పుట్టిన కూతురు ...తనెంతో అల్లారుముద్దుగా పెంచిన కూతురు...అలా మాట్లాడుతుందని ఆమె ఎన్నడూ ఊహించను కూడా లేదు. అందుకే ఆమె కొక్కసారిగా నీరసం ఆవహించింది.

ఈశ్వరమ్మ పరిస్థితి చూస్తున్న రామనాథం ఆమె దగ్గరికెళ్ళి ఆమెను పొదివిపట్టుకుని వరండాలో కెళ్ళిపోయాడు.

వాళ్ళు ముగ్గురింకా దెబ్బలాడుకుంటూనే ఉన్నారు.

* * *

జరిగిన తగవుతో భార్యాభర్తలిద్దరి మనసులు వికలమైపోయాయి! ఈశ్వరమ్మ విచారంగా తలకు చేయి ఆన్చుకొని కూర్చునివుండటం చూసిన రామనాథం ఆమెను తీసుకొని పక్కవీధిలో తెలిసినవాళ్ళింట్లో బొమ్మలకొలువు చూడ్డానికి తీసుకెళ్ళాడు.

విశాల భర్తతో కలిసి ఫ్రెండ్స్ యిళ్ళకు వెళ్ళింది.

వరండాలో కూర్చుని పేపరు చదువుతున్న హరీష్ దగ్గరకు వచ్చి "మీ రిక్కడున్నారా?" అంటూ అతనిపక్కన కూర్చుంది కాంతి.

"ఏమిటీ?"

"అదికాదండీ! మీకో విషయం చెప్దామనీ..."

"ఏమిటది చెప్పు?"

"మీ అమ్మా నాన్నలను..."

"ఊ! మా అమ్మానాన్నలను..."

"మీ అమ్మానాన్నల నెక్కడికైనా పంపేద్దామండీ!" నెమ్మదిగా అంది.

"ఎక్కడికి పంపేద్దాం? మా తమ్ముడి దగ్గరికా?"

"ఊ...! మీ తమ్ముడిభార్య ముందే చెప్పేసిందిగా! 'హైదరాబాదులో యిళ్ళు చాలా చిన్నవి! మేం వుంటున్న యిల్లు కూడా చాలా చిన్నది! మాకే సరిపోవట్లేదు, అని!"

"మరి...ఏం చేద్దామంటావ్?" అన్నారు విసుగ్గా. ప్రతిరోజూ ఇంట్లో ఏదో విషయానికి దెబ్బలాటలు జరుగుతుండటంతో అతనికూడా తల్లిదండ్రుల నెక్కడికైనా పంపేయాలనిపించింది అందుకే అలా అన్నారు.

"మీ ఫ్రెండు ఊరి చివర స్థలం కొన్నాడు గదండీ!"

"ఊఁ! అయితే!"

"ఆ స్థలం ఖాళీగానే వుందాయె! అక్కడ ఓ షెడ్డువేసి యిచ్చేద్దాం!"

ఇంతలో సురేష్, అతనిభార్య తమ గది నుండి బయటకువచ్చారు.

"సురేష్! విమలా! మిమ్మల్నే యిటు రండి!" అని పిలిచింది కాంతి.

"ఏమిటొదినా?" అంటూ వచ్చారు సురేష్.

విషయం చెప్పింది.

"అవునన్నయ్యా! వదిన చెప్పినట్టు చేద్దాం! నా వాటాలో అద్దెకున్నవాళ్ళకు ఆ యిల్లు వదిలిపోవల్లేదంట! ముందుగది కూడా ఖాళీచేసి యిమ్మంటున్నారు!" అన్నాడు సురేష్.

"అత్తయ్యా వాళ్లుంటున్న ఆ ముందుగది కూడా ఇస్తే మరో వంద ఎక్కువ కూడా యిస్తామంటున్నా రక్కయ్యా!" అంది విమల.

"అవునొదినా! వాళ్ళకా షెడ్డు వేయడానికి మహా అయితే ఓ మూడొందలు ఖర్చవుతుంది! అంతేగా!" అన్నాడు.

"నేనూ అదే అంటున్నాను మరిది గారూ. మీరో ఏభై నేనో ఏభై నెలకు యిచ్చేస్తే వాళ్ళక్కడే వండుకుని తిని వుంటారు!" అంది కాంతి.

"కానీ నా ఫ్రెండు అక్కడే ఇల్లు కడతానంటే...?"

"మీ ఫ్రెండ్ అప్పుడే యిల్లు కట్టడు. తను రిటైర్ అయిన తరువాత కడతానని మీ ఎదురుగానే అన్నాడు కదండీ! మీ ఫ్రెండ్ రిటైర్ అయ్యేసరికి ఈ ముసల్వాళ్ళిద్దరూ బతికుంటే అప్పటి విషయం ఆలోచించవచ్చు! మీరడిగితే మీ ఫ్రెండ్ కాదనడు కూడా!"

"సరే! అమ్మానాన్న రానీ చెప్తాం!" అన్నాడు హరీష్!

"మీకా శ్రమ అక్కరలేదులేరా! మేమంతా విన్నాం!" అంది ఈశ్వరమ్మ గుమ్మంలో కొస్తూ.

వణుగుతూ ఆశ్చర్యపోయారు.

"ఈశ్వరీ! నా బిడ్డలు ముత్యాలు, రత్నాలు అన్నావు కదే! చూడు! వీళ్ళు మనల్ని షెడ్ లో వుంచుతారట!" అన్నాడు రామనాథం.

"ఏమండీ! మన మీ యింట్లో ఒక్క క్షణం కూడా వుండొద్దండీ! మనమెక్కడికయినా వెళ్ళిపోదామండీ! ఏమండీ! ఏమండీ! నన్నెక్కడికైనా తీసుకు వెళ్ళిపోండి" అంటూ హిస్టీరియా వచ్చినామెలా ఏడ్చింది ఈశ్వరమ్మ.

"వెళ్ళిపోదాం ఈశ్వరీ! మనం యీ

ఇంటి నుండి తక్షణం వెళ్ళిపోదాం! నిన్ను పోషించలేనంత అసమర్థుడు కాడీ రామనాథం!" అన్నాడు ఆవేశంగా.

ఇద్దరూ లోనికెళ్ళి పావుగంటలో తమ సామానంతా సర్దుకుని వచ్చేసారు.

కోడలితో "అమ్మా శాంతీ మాకు నెలకివ్వాలనుకున్న ఏభై నీ పిల్లలకు పనికొస్తుంది వుంచుకో తల్లీ!"

చిన్న కొడుకుతో "ఒరే! సురేష్! నీ తల్లి తనపేర ఉన్న యింటిని మేం బ్రతికుండగానే మీపేర్న రాసినందుకు మాకు బాగా బుద్ధిచెప్పావురా! ఇప్పుడు మేం వెళ్ళిపోతున్నాంగా! నీకా అద్దెవాళ్ళు ఏగస్ట్రాగా యిచ్చే వందా నువ్వు మాకివ్వాలనుకున్న ఏభై నెరసి నూటఏభై నెలకు మిగుల్తాయి! జాగ్రత్తగా దాచుకో! ఇక మీరిద్దరూ కలిసి మాకోసం ఖర్చు పెడ్తామనుకున్న మూడొందలు పెట్టి మేమిద్దరం చచ్చామని తద్దినం చేయండి!" ఆవేశంగా కన్నీరు ఉబికిపోతుండగా అన్నాడు రామనాథం.

అంతలో విశాల ఆమె భర్తా వచ్చారు

"అమ్మా... నాన్నా... ఎక్కడికి... ఎక్కడికెళ్ళిపోతున్నారు?" గాభరాగా అడిగింది.

"అమ్మా విశాలా! మేం ఇల్లు విడిచి వెళ్ళిపోతున్నామని విచారించకు తల్లీ! నేను మీలా దగా చేయనులేమ్మా! మీ అమ్మ చనిపోయిన వెంటనే నీకు కబురు పెడతాను! వచ్చి మీ అమ్మ వంటిమీద నగలన్నీ తీసుకుందువుగాని!" అంటూ ఈశ్వరమ్మను తీసుకుని గేటుదాటి బయటకు వచ్చేసాడు రామనాథం.

అటువైపుగా వెళ్తున్న ఆటోని పిలిచి "బస్ స్టేషన్‌కు పోనియ్!" అని చెప్పాడు.

ఆటోలో కూర్చునివున్న ఈశ్వరమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

"ఊరుకో ఈశ్వరీ! ఇప్పుడేమైందని ..." అంటూ అనునయించారు.

"ఇన్ని సంవత్సరాలు మాకోసం మీరు ఎండనక వాననక కష్టపడ్డారు. ఈ వయసులో కూడా...." ఆ తర్వాత ఆమె గొంతులో కన్నీరు అడ్డంపడి మాట రాలేదు.

రామనాథం ఏదో చెప్పబోయేంతలో స్టేషన్ వచ్చింది.

• • •

"ఏమండీ ఎక్కడికెళుతున్నాం?" అడిగింది ఈశ్వరమ్మ.

"నువ్వు చాలా రోజులనుండి 'కనక దుర్గ గుడి' చూడాలని వుందని అన్నావు కదే! అందుకే విజయవాడ వెళ్దాం!" అన్నాడు టిక్కెట్లు జేబులో పెడుతూ!

యింతలో బస్ రావడంతో ఇద్దరూ బస్సెక్కారు.

బస్సు విజయవాడ చేరిన తర్వాత స్టేషన్‌లో నుండి బయటకు వచ్చి కనక దుర్గ ఆలయాని కెళ్ళారు. కొండమీద దర్శనం కానిచ్చి అదే ఆటోలో

కూర్చుని "నారాయణ హోటల్ కు పోనిమ్!" అన్నాడు రామనాథం.

హోటల్ లో భోజనం కానిచ్చి పక్క వీధిలో వున్న ఒక ఇంటికి తీసుకెళ్ళాడు అది రెండు వాటాలున్న యిల్లు!

"ఏమండీ ఇదెవరిల్లు?" ఆశ్చర్యంగా అడుగుతూ లోని కడుగు పెట్టింది.

రామనాథం ఈశ్వరమ్మ ప్రశ్నకు బదులివ్వక ఆమెని అరుగుమీద కూర్చో పెట్టి ప్రక్కయింటి కెళ్ళాడు. కొద్దిసేపు అయిన తర్వాత రామనాథం లీలానందం వెంటబెట్టుకొచ్చాడు.

లీలానందం "నమస్కారం వదిన గారూ!" అన్నాడు.

అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ ప్రతి నమస్కారం చేసింది.

"నేనెవరా అని ఆశ్చర్యపోతున్నారా వదినగారూ! నేనండీ రామం చిన్నప్పటి స్నేహితుణ్ణి! మీ పెళ్ళయిన కొత్తలో నన్ను నే పరిచయం చేసుకుంటూ పొరపాటుగా ఒకే మంచంలో అని ఒకే కంచంలో పడుకున్నామని చెప్పాను గుర్తుందా?" అడిగాడు.

"ఏం ఈశ్వరీ! వీణ్ణి మరిచిపోయావా? మన పెళ్ళయిన కొత్తలో ఆదివారం వస్తే మనింటికొచ్చి తిష్టవేసేవాడు! నువ్వు గారెలు బాగా వండుతావని ఒక సారి ఇరవై గారెలదాకా తినేసి రెండు రోజులు భేదుల్తో బాధపడ్డాడు!" జ్ఞాపకం చేశాడు.

ఈశ్వరమ్మకు అతనెవరో అప్పుడు గుర్తొచ్చింది! ఆమె కళ్ళముందు ఆ తీపి జ్ఞాపకాలు సినిమారీళ్ళలా కదిలాయి! ఆమె గుర్తొచ్చిందన్నట్లు నవ్వింది! వారిద్దరు కూడా చిన్నగా నవ్వారు.

లీలానందం తాళంచెవి తీసి లోనికి ఆహ్వానించాడు.

ఆ యిల్లు రెండు వాటాలయినా ఒక వాటాలో నుంచి రెండో వాటాలో కెళ్ళటానికి తలుపులున్నాయ్. కొళాయి, బావి కూడా వున్నాయ్! ఇంటిముందు చిన్న పూలతోట, పెరట్లో మామిడి, జామచెట్లు, కూరగాయల మొక్కలు, పాదులు వున్నాయ్!

"ఎలావుంది ఈశ్వరీ యిల్లు?" అడిగాడు

"ఇల్లు చాలా బాగుందికానీ అద్దెంత వుంటుందో ఏమో! అయినా యింత పెద్ద యిల్లు మనకెందుకండీ!" అంది ఈశ్వరమ్మ.

"ఒరే రామం! వదిగారికి విషయం యింకా చెప్పలేదా?" ఆశ్చర్యంగా అన్నాడు లీలానందం.

"ఏ విషయం?" అడిగింది.

"ఈశ్వరీ! ఇది...ఇది....మన స్వంతిల్లు! ఎలా వుంది? నీకు నచ్చిందా?" అన్నాడు మందస్వరంతో.

"ఏమిటీ? ఇది మనిల్లా?" ఆశ్చర్యం, ఆనందం మిళితమయిన స్వరంతో అంది.

"అవును ఈశ్వరీ! ఇది మనిల్లే! నా కష్టార్జితంతో కొన్న యిల్లు! ఈశ్వరీ! మనం మన పిల్లల్నెంతో గారాబంగా, అల్లారుముద్దుగా పెంచాం! నాకంటే నువ్వు మరీ ప్రేమగా చూసేదానివి! పరీక్షల్లో తక్కువ మార్కులొస్తే నేను కొట్టే వాణ్ణి! కానీ నువ్వు కొట్టడం కాదుకదా కనీసం ఒక్క తిట్టయినా తిట్టేదానివి కాదు! అంత ప్రేమగా వాళ్ళను పెంచావ్! వాళ్ళు కూడా వాళ్ళ పెళ్ళిళ్ళయేంత వరకు మననెంతో ఆదరంగా చూసారు. వాళ్ళు ప్రేమించిన అమ్మాయిలతోనే వాళ్ళ పెళ్ళిళ్ళు జరిపించాం! విశాలకు మనమే సంబంధం చూసి పెళ్ళిచేసాం! కానీ పెళ్ళయిన తరవాత వాళ్ళ మనస్తత్వాలు విచిత్రంగా మారిపోయాయని నేను తెలుసుకోగలిగాను. వాళ్ళమీదున్న ప్రేమతో వాళ్ళు మారిపోయారని నీవు గుర్తించలేకపోయావ్!

"అందుకే వాళ్ళు కోరిన వెంటనే ఆస్తి పంచేశావ్! ఆస్తి పంచిన తర్వాతైనా వాళ్ళు మనల్ని ఆప్యాయంగా చూస్తారనుకుంటే అంతకంటే హీనంగా, నీచంగా చూసేవారు!

"అప్పుడే నేను విజయవాడ పెళ్ళికెళ్ళడం జరిగింది. అక్కడ పెళ్ళిలో లీలానందం కనిపించాడు! చాలా రోజుల తర్వాత కలిసినందుకు ఎంతో సంతోషించి ఒకరి యోగక్షేమాలు మరొకరడిగి తెలుసుకున్నాం! వాడికి మన యింటి పరిస్థితి చెప్పాను."

ఇప్పుడే అలా ప్రవర్తిస్తున్న వాళ్ళు రేపొద్దున యింటినుండి వెళ్ళగొట్టరని నమ్మకమేమిటని అడిగాడు! నేనేం మాట్లాడలేకపోయాను.

"పోనీ డబ్బేమైనా నీ పేర్న వుందా?" అని అడిగాడు. రిటైర్ అయిన తర్వాత ఆఫీసువాళ్ళిచ్చిన లక్ష యాభై వేలతో యాభై వేలు పిల్లలకు పంచి, లక్ష నీ పేర్న వేశానని చెప్పాను! ఆ విషయం పిల్లలకే కాదు నీక్కూడా తెలియదు!

"అప్పుడు వాడు తనింటి పక్కనే యిల్లు అమ్మకానికుందని, అది కొనేయమని సలహా యిచ్చాడు. నేను యిల్లు చూసి వెంటనే కొనేశాను.

"లీలానందమే ఎవర్నో అద్దెకు దింపి ఆ అద్దె తనే ఇక్కడి బ్యాంక్‌లో జమ చేసేవాడు. వాళ్ళకు ట్రాన్స్‌ఫర్ అయిపోయిందని లీలానందం వారంరోజుల క్రితమే ఉత్తరం రాశాడు మరెవరికైనా వీలయినంత తొందర్లో దింపమని జవాబు రాశాన్నేను. యింతలో యిలా జరిగింది. వాళ్ళు మనల్ని ఆదరంగా చూస్తే పిల్లల పేర్నే యీ యిల్లు రాద్దామనుకున్నాను! వాళ్ళు...? కనీసం విశాలైనా మనల్ని ప్రేమగా చూస్తుందనుకున్నాను. కానీ తను కూడా అలానే ప్రవర్తించింది"

"మరి నాకీ విషయం ముందే ఎందుకు చెప్పలేదండీ?"

"నువ్వు పిల్లలమీదున్న ప్రేమతో ఎప్పుడో ఓసారి నోరు జారతావని చెప్పలేదు ఈశ్వరీ!"

"వాళ్ళు నన్ను అంతలేసి మాటలంటున్నప్పుడు కూడా మరి ఇంటికి వచ్చేద్దామని ఎందుకనలేదండీ?"

"ఈశ్వరీ! మన పిల్ల నీరోజా కాపోతే శేసైనా మారుతారనుకున్నాను! కానీ వీళ్ళు మారలేదు. కానీ ఈరోజా... ఈ రోజా వాళ్ళ మాటలు వింటుంటే నాకు మతిపోయింది! అందుకే నిన్ను వెంట పెట్టుకుని యిక్కడికి కొచ్చేశాను!" అని గట్టిగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఏమండీ! మనకు ఇల్లెలా గడుస్తుందండీ? మీకా పెన్షన్ లేదు. బ్యాంకులోని డబ్బు కూడా తీసేశారాయె!" అంది బాధగా ఈశ్వరమ్మ.

"ఇంత పెద్దిల్లు మనకెందుకు ఈశ్వరీ! ఒక వాటాలో మనముండి పక్కవాటా అద్దెకిచ్చేద్దాం! ఇహపోతే రిటైర్ అయినపుడు వేసిన లక్ష రూపాయలు, లక్ష డెబ్బైఅయిదువేలు అయింది! ఇల్లు కొనగా మిగిలిన ఇరవై వేలు మళ్ళీ బ్యాంకులోనే వేసేశాను! కాబట్టి మనమేం బెంగపడవలసిన అవసరంలేదు! నిన్ను నీ పిల్లలు చూసినదానికంటే బాగానే చూస్తాను. ఈశ్వరీ!" అన్నాడు.

"ఇక వాళ్ళ సంగతి వదిలేయండీ! వాళ్ళు... వాళ్ళు... మనకు పుట్టలేదనుకుంటాను! అసలు... అసలు... మనకు పిల్లలే పుట్టలేదనుకుంటానండీ!" అంది బాధగా.

ఇంతలో ఏదో తక్కుమని చప్పుడవడంతో ఇద్దరూ తేరుకుని వెనక్కు తిరిగిచూశారు. లీలానందం ఎప్పుడెళ్ళిపోయాడోగాని, అతనూ, అతని భార్యా చెరో మంచం, తలగడలు పట్టుకొచ్చి వేశారు.

పక్క వేసిన తరువాత భార్యను పరిచయం చేశాడు.

"ఈమె నా భార్య వరలక్ష్మి! ఊర్లో చుట్టాల పెళ్ళికెళ్ళి యిప్పుడొచ్చింది!" అన్నాడు.

"నమస్కారం అక్కయ్యగారూ!" అంది వినయంగా ఆమె.

ప్రతినమస్కారంచేసింది ఈశ్వరమ్మ.

"వదినగారూ! మీ రిక్కడకొస్తున్నప్పుడు హోటల్లో భోంచేసి రావడం ఏమన్నా బావుందా చెప్పండి! అందుకే మీరు వంటసామాన్లు అవీ కొనుక్కునే వరకు టిఫిను, భోజనం అన్నీ మా యింట్లోనే! అంతే కనీసం వారంరోజులైనా మా ఆతిథ్యం స్వీకరించందే మేం ఊరుకోం! అన్నట్టు అసలు విషయం చెప్పడమే మరిచిపోయాను! ఇదిగోరా రామూ! నీ బ్యాంక్ బుక్! వాళ్ళిచ్చిన అద్దె మొత్తం యిందులో వుంది!" అని పాస్ బుక్ రామనాథానికి యిచ్చాడు.

వాళ్ళు చూపుతున్న ప్రేమకు కళ్ళు చెమర్చాయి ఈశ్వరమ్మకు.

ఇటువంటి రక్తసంబంధం లేకపోయినా వాళ్ళెంత ఆదరంగా, ఆప్యాయంగా మాట్లాడుతుంటే ఈశ్వరమ్మకు ఆనందంతో కళ్ళు చెమర్చాయి. భార్య మొహంలోకి చూస్తున్న రామనాథం హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. •